బీచ్‌లో పోలీసులు పహరా

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం పుక్కళ్లపాలెం సముద్ర తీరంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు భారీ సంఖ్యలో వచ్చి సముద్ర స్నానాలు చేసి అరటి బెరడల్లో దీపాలు వదిలారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రమేష్ ఆదేశాలు మేరకు హెడ్ కానిస్టేబుల్ టి ఉమామహేశ్వరరావు, రవీంద్ర, ప్రకాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

లోకాయుక్త, గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసున్నా..

ఆగని 'అకమ్ర' నిర్మాణం

కళ్ళున్నా...కబోదిలా 'సుడా' అధికారులు

హైకోర్టు తీర్పు ధిక్కరిస్తున్నా...పట్టించుకోని 'రెవెన్యూ'

విశాలాంధ్ర - నరసన్నపేట: పట్టణంలోని రాతికర్ర చెరువు గర్భంలో అక్రమంగా బహుళ అంతస్థుల ప్రైవేటు ఆసుపత్రి నిర్మాణం అవుతున్నా, సుడా అధికారులు కళు ్ళన్నా..కబోదిలా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు రాతికర్ర చెరువును కప్పి, పలు భవనాలు అక్రమంగా నిర్మాణం చేశారని లోకాయుక్త, గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టుల్లో కేసు ఉన్నా..సంబంధిత రెవెన్యూ అధికారులు నేరం నాది కాదు...మేజర్ పంచాయితీదని తప్పించుకొని తిరుగుతున్నారు. దీనిని అసరాగా తీసుకొని సంబంధిత ప్రైవెటు ఆసుపత్రికి చెందిన వ్యక్తులు కూటమి ప్రభుత్వానికి చెందిన కొంతమంది సహకారంతో రాతికర్ర చెరువు గర్భంలో యుద్ధప్రాతిపదికన అక్రమంగా బహుళ అంతస్థులు నిర్మాణం చేపట్టారు. గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్-187లో సుమారు 2.75ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాతికర్ర చెరువును గతంలో ప్రజాప్రతినిధులు (ఇరు పార్టీలకు చెందినవారు) అండతో పూర్తిస్థాయిలో కప్పి, సుమారు 50కి పైగా అక్రమంగా భవనాలు నిర్మాణం చేసుకున్నారు. అయితే ఈ చెరువులోని సుమారు 13సెంట్లులో ఒక వైద్యాధికారి 2000వ సంవత్సరంలో ప్రైవెటు ఆసుపత్రి ఒక ఫ్లోర్ నిర్మాణం చేశారు. మరలా ఇప్పుడు ఎటువంటి అనుమతి పత్రాలు సుడా సంస్థ నుండి లేకుండా అక్రమంగా మరో రెండు అంతస్థులు నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.2కోట్లు విలువ చేసే ఈ స్థలంలో ప్రైవెటు ఆసుపత్రి నిర్మాణాన్ని అక్రమంగా చేపడితే, కఠిన చర్యలు తీసుకొని, నిర్మాణాన్ని ఆపాల్సిన రెవెన్యూ, సుడా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరించటంపై పట్టణ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాక గత 2022వ సంవత్సరం సెప్టెంబర్ నెల 14వ తేదీన అప్పటి హైకోర్టు, చీఫ్ జస్టిస్, ప్రశాంత్ కుమార్ మిశ్రా చెరువు గర్భాల్లో ఎటువంటి శాశ్వతమైన భవన నిర్మాణాలు చేయరాదని ఆదేశాలు జారీ చేసి, రాష్ట్రంలోని పంచాయితీ కార్యదర్శులకు, రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేయటం జరిగింది. హైకోర్టు జారీ చేసిన నోటీసులను దృష్టిలో పెట్టుకొని, రెవెన్యూ అధికారులు అక్రమ ప్రైవెటు ఆసుపత్రి నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా, మౌనం ప్రకటించటం ఎంత వరకూ సమంజసమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలోని ఇసకలపాలెం గ్రామంలో కొయ్యన యర్రయ్య మేకల పాకలో బుధవారం వేకువజామున కుక్కలు దాడి చేయటంతో 20 మేకలు మరణించాయి. దాడిలో అప్పటికప్పుడే 14 మేకలు మరణించగా సాయంత్రానికి సంఖ్య 20కి చేరింది. నిరుపేద రైతు బోరున రోడ్డుపై పడి గుండె బాదుకొని ఏడుస్తుంటే చూసేవాళ్ళ కళ్ళలో నీళ్లు తిరిగాయి. మేకలను మేపుకుంటూ కుటంబ పోషణ చేసుకొనే కొయ్యాన యర్రయ్య మేకల మరణంతో నష్టపోయానని ఆదుకోవాలని కోరాడు. స్థానిక నాయుకులు పల్లి సురేష్ ఘటన స్థలం చేరుకొని రైతుకు భరోసా కల్పించారు.

వైసీపీ కోటి సంతకాలు సేకరణ

విశాలాంధ్ర - కొత్తూరు: వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ శాసనసభ్యులు రెడ్డి శాంతి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమాన్ని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలం గులివిందుల పేట, మెట్టూరు, నీలకంఠాపురం గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పారాపురం ఎంపీటీసీ వడుము లక్ష్మీనారాయణ, మండలం ఉపాధ్యక్షులు వై.ధర్మారావు, వైసిపి ఎస్సీ సెల్ కార్యదర్శి గంధవరపు నాగేంద్ర, నమ్మగడ్డ కృష్ణారావు, మతం పూర్ణ, తమ్మి నాయుడు, కృష్ణమోహన్, కొత్తూరు ఎస్సీ సెల్ కన్వీనర్ మురపాక శంకర్రావు, వరహాలింగం, గెల్లంకి మాధవరావు శేషగిరిరావు, మురళి, బుద్దు, చాల్ల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమం బుధవారం హిర మండలం మేజర్ పంచాయతీ లోని పాత బస్టాండ్ వద్ద పాతపట్నం మాజీ

ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో జరిగింది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఆంధవరం వెంకట్, సురేష్ , మండలవైసీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, హిర మండలం సర్పంచ్ దేవు దల సుందరమ్మ, వైస్ ఎంపీపీ ప్రతినిధి వంగ పల్ల చిన్నారావు, లుక లాపు ప్రసాద్, సర్పంచ్ వంజరాపు చిరంజీవి, వెలమల బాలరాజు , ఎంపీటీసీ బెవర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రాష్ట్రంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం మండలంలో గొనపాడు పంచాయితీలో

ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఇష్టానుసారంగా హామీలను ఇచ్చి పదవిలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. తక్షణమే మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల వైసీపీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, స్థానిక నాయుకులు మామిడి తిరుపతి రావు, మూడడ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన సీపీఐ పోరాటం

దాకరాపల్లికి శ్మశాన స్థలం కేటాయింపు

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి: సీపీఐ పోరాటం ఫలించింది. ఎన్నో ఏళ్లుగా మూడు గ్రామాలకు సరైన శ్మశాన వాటిక లేక పడుతున్న తీవ్ర ఇబ్బందులను గమనించిన సీపీఐ నేతలు ప్రభుత్వంతో పోరాటం చేశారు. చివరకు ప్రభుత్వం ఆ గ్రామస్తులకు 15 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ బుధవారం సంబంధిత అధికారి పట్టాను సీపీఐ నేతలు అరేలమ్మ, నారాయణస్వాములు చేతుల మీదుగా అందజేశారు. వివరాల్లోకి వెళితే కంచిలి పంచాయతీ దాకరాపల్లి, దాకరాపల్లి కాలనీ, పెద్ద దాకరాపల్లి గ్రామాలకు శ్మశాన వాటిక లేక పడు తున్న ఇబ్బందులను సీపీఐ నేతలు గమనించి వారి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. మండల తహశీల్దార్‌తోపాటు జిల్లా కలెక్టర్ వరకు వెళ్లి పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. ఆ గ్రామాల ప్రజల బాధలను వివరించారు. దీని ఫలితంగా వారి సమస్య నెరవేరడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పుక్కళ్ల అరేలమ్మ, సీపీఐ నేత సాలిన నారాయణస్వామి విశాలాంధ్రతో మాట్లాడుతూ సీపీఐ సాధించిన గొప్ప పోరాట విజయంగా పేర్కొన్నారు. అలాగే ఇదే పంచా యతీ బల్యాపుట్టుగలోను గతంలో కొంత మందికి 297/3 సర్వే నెంబర్‌లో అక్రమంగా డిపట్టాలు అందించి భూకేటాయింపులు నిబంధనలకు

విరుద్ధంగా చేపట్టారని పేర్కొన్నారు. దీనిపై కంచిలి పంచాయతీ కూడా ఆగస్టు 1, 2007న పట్టాలు రద్దు చేయాలని తీర్మానం చేసిందని పేర్కొన్నారు. అప్పటి ఆర్డీఓ విచారణలోను భూకేటాయింపులు నిబంధనలకు విరుద్ధమని గుర్తించారు. ఈ పరిస్థితుల్లో అక్కడ పట్టాలు రద్దు చేసికంచిలి పంచాయతీలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించాలని కోరారు.

బాలి యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కళింగ సామ్రాజ్య చారిత్రక వైభవాన్ని చాటి చెప్పే బాలి యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బాలి యాత్ర నిర్వాహక కమిటీ సభ్యులు ఎల్.కరుణాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కోటబొమ్మాళిలో బాలి యాత్ర ఆహ్వాన పత్రాలను వివిధ ఆలయాల వద్ద భక్తుల మధ్య ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం శ్రీముఖలింగం శ్రీ మధుకేశ్వయస్వామి సన్నిధిలో, వంశధార నదీ తీరంలో బాలి యాత్ర జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని కళింగ సామ్రాజ్య పురాతన సంస్కృతీ సాంప్రదాయాలను విశ్వ వ్యాప్తం చేయాలని, కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ధూపాన రమణారెడ్డి, కమ్మ కట్టు శ్రీనివాసరెడ్డి, నౌపడా మురళీధరరావు పట్నాయిక్, మెట్ట కాళేశ్వరరావు, మెట్ట సింహాచలం, జనార్ధన గురుభవాని తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ క్రికెట్ టీమ్ స్ఫూర్తితో బాలికలు ఎదగాలి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: దేశ మహిళా క్రికెట్ టీమ్ ప్రపంచ మహిళా వరల్డ్ కప్‌ను సాధించడం దేశానిక గర్వకారణమని, మహిళలు విమెన్ క్రికెట్ టీం సభ్యులను స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో బుధవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సుడిగాలి పర్యటన చేశారు. నగరంలోని ఉమెన్స్ జూనియర్ కళాశాలలో కొవ్వాడ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సి.ఎస్.ఆర్ నిధులు రూ.99 లక్షలతో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులు 2కోట్ల అరవై లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. 1300 వందల మంది విద్యార్థులు గల ఈ కళాశాల రాష్ట్రంలోనే 3వ అతి పెద్దది అని గుర్తు చేశారు. ఈ స్థాయి వైభవం ఉన్నా.. వసతుల లేమి తనను కలవరపెట్టిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, ఇండస్ట్రీతో పాటు సమానంగా యువత విద్య విషయంలో కూడా విశేషంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు, అణు విద్యుత్ కేంద్రం డైరెక్టర్ రవి కుమార్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తున్నాం

- ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం జడ్పీ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా డీఆర్సీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధి వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలను ప్రతి త్రైమాసికానికి నియోజకవర్గాల వారీగా చర్చించి, సమన్వ యంతో ముందుకు వెళ్తామని మంత్రి ఉద్ఘాటించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని, డిఆర్సి వరకు వేచి చూడకుండా నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా, ఎం ఎస్ఎంఈ పార్కు మౌలిక వసతులను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని, ఇంకా నమోదు కాని వితంతు పింఛనులను అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కేంద్రం, రాష్ట్రం చెరో రూ.300 కోట్లు కలిపి మొత్తం రూ.600 కోట్లతో పీఎంఈజీపి, సీఎంఈజిపి కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వ్యవసాయం, ఉపాధి హామీ , నైపుణ్యాభివృద్ధి, పంచాయతీరాజ్, సామాజిక సంక్షేమం, శానిటేషన్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు, ప్రజాప్రతినిధులనుద్దేశించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కొందరు చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని, 98 శాతం ఈ-క్రాప్ నమోదు చేశామని స్పష్టం చేశారు. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ వరదల కారణంగా రంగు మారిన ధాన్యాన్ని కూడా తక్షణ చర్యలు తీసుకుని కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రణస్థలం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పాల్గొన్నారు.

జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై అవగాహన

విశాలాంధ్ర-సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పర్యవేక్షణాధికారి, ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్ హాజరై విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఏ.మోహనరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన జీవనోపాధిపై అవగాహన

విశాలాంధ్ర-మందస: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మహిళా సంఘ సభ్యులు అందరి ఆమోదంతో తీసుకున్న రుణాలను, సక్రమంగా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకొని, ప్రతి గ్రామంలో మహిళలు ఎంటర్ప్రెనర్లుగా తయారు కావాలనే ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం కుసుమల, దేవ్ పురం గ్రామ సంఘం మహిళలు సమావేశాలు

జరిపించుకొని ప్రస్తుతం ప్రభుత్వం మహిళాభివృద్ధికి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కుసుమల అధ్యక్షురాలు ఎస్.పద్మావతి, దేవ్ పురం అధ్యక్షురాలు జి.భారతి, వివోఏలు జగబంధు, ఆనంద్, పుష్ప, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచుతాం

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని పెద్దగనగల్ల వానిపేట మత్స్యకార గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి కేంద్ర ఆయన పరిశీలించారు. నాగావళి నది సముద్రంలో కలిసే ఈ ప్రాంతంలో తీరం కోతకు గురవుతోందని తెలుసుకున్న రామ్మోహన్ నాయుడు.. అందుకు గల పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పెద్ద గనగల్లవానిపేట తీరం సమీపంలో కేంద్ర ప్రభుత్వ నిధులు కోటి నలభై లక్షలతో నిర్మించనున్న స్టోరేజ్ షెల్టర్ భవనానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వైజ్ఞానిక పర్యటనకు 'దీపక్'

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : తన పేరును సార్ధకం చేసుకునేలా పేరులో ఉండే కాంతిని తన విద్యా జీవితంలో వెలిగించుకుంటూ ప్రతి స్థాయిలో ప్రతిభను కనబర్చుకుంటూ జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పట్టణానికి చెందిన పాండవ దీపక్ పయనమయ్యాడు. న్యాయవాది నారాయణ సాహు సంధ్యారాణి దంపతుల పెద్ద కుమారుడు పాండవ దీపక్ పురుషోత్తపురం మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతు, తనలోని ప్రతిభను పదునుపెట్టుకుంటూ వివిధ సాంకేతిక అంశాలపై దృష్టి సారించి ప్రయోగాత్మక ప్రదర్శనల్లో స్థానాన్ని పొందుతున్నాడు. ఈ నెల 6 నుండి 8 వరకూ దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న వైజ్ఞానిక పర్యటనకు దీపక్ అర్హత సాధించాడు. ఏ.పి సమగ్ర శిక్షా, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 52మంది విద్యార్థులు పాల్గొంటుండగా ఒక్కో జిల్లా నుండి ఇద్దర్ని ఎంపిక చేసారు. ఆ క్రమంలో శ్రీకాకుళం జిల్లా నుండి ఎంపికైన విద్యార్థులో దీపక్ ఒకడు. అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ద్వారా శిక్షణ పొంది ఏ.ఐ ఆధారిత యాప్‌ను డెవలప్ చేయగా, ఇటీవల బెంగళూరులో అమెజాన్ ఆధ్వర్యంలో ప్రదర్శనలో పాల్గొని ప్రశంశలు అందుకున్నాడు. వివిధ సైన్స్ ప్రాజెక్టుల్లో పాల్గొని, ఎన్. ఎం. ఎం. ఎస్ పరీక్షలో ఉత్తీర్ణత పొందడంలో నేషనల్ సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు ఎంపికయ్యాడు.

డెల్ఫీ టివిఎస్‌లో 117 మందికి ఉద్యోగావకాశాలు

- ప్రాంగణ నియామకంలో ఐతం విద్యార్థుల కీర్తి పతాకం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని ఐతం కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి విశిష్టత సాధించారు. ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ డెల్ఫీ టివిఎస్ నిర్వహించిన ప్రాంగణ నియామక కార్యక్రమంలో ఐతం విద్యార్థులు ఘన విజయాన్ని సాధించి 117 మంది ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు వెల్లడించారు. ఎంపికైన వారిలో బి.టెక్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల విద్యార్థులు 59 మంది, డిప్లొమా విభాగాల విద్యార్థులు 58 మంది ఉన్నారని ఆయన వివరించారు. ఎంపికైన వారికి రూ.3లక్షల ప్రారంభ వార్షిక వేతన ప్యాకేజీ ప్రకటించబడిందని తెలిపారు. ఈ విజయానికి విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, పరిశ్రమలపై అవగాహన, ఇంటర్వ్యూలో ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం ప్రధాన కారణాలని ప్రొఫెసర్ నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎఎస్. శ్రీనివాసరావు, డీన్ ప్లేస్‌మెంట్స్ డా. ఎం. సంతోష్‌కుమార్, ప్లేస్‌మెంట్ హెడ్ డా. శ్రీకాంత్, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు, డీన్లు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీయులు క్షేత్ర సందర్శన

విశాలాంధ్ర - ఆమదాలవలస: సహజ వ్యవసాయ పద్ధతిలో అవలంబించడం ద్వారా నేల సంరక్షణ, ఆరోగ్యం ఆహారం అభివృద్ధి జరుగుతుందని జనరల్ మేనేజర్ నాబార్డు ప్రాంతీయ కార్యాలయం ఆంధ్ర ప్రదేశ్ పహాడ్ సింగ్ తెలిపారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఐఎఫ్ఏడి (ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్మెంట్), మాళవిక (అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్మెంట్ కార్పొరేషన్) సంబంధించిన అధికారులు బుధవారం సీతంపేట మండలంలో బూర్జ గూడ, గుజ్జీ, దుగ్గి .చిన్న పొల్ల, జయపురం గూడ, గడి గుజ్జి గ్రామాల్లో సందర్శించారు. బయో రిసోర్స్ సెంటర్ ద్వారా ఆవు మూత్రం, పేడ ద్వారా ఘన జీవామృతం, ద్రవ జీవ అమృతం, కషాయాలు తయారు చేసి రైతులకు భవిష్యత్తు తరాల్లో రసాయనికి పురుగుమందులు లేని వ్యవసాయ ప్రాంతాలు తయారు చేయడం జరుగుతుందని ఎన్.సన్యాసి రావు వివరించారు. విదేశీ ప్రతినిధులు కన్సల్టెంట్-ఉజ్వల దండేకర్, దినేష్ కుమార్ రెడ్డి డిడిఎం నాబార్డు. పార్వతీపురం, రమేష్ కృష్ణ డిడిఎం నాబార్డు శ్రీకాకుళం, రేఖ అసిస్టెంట్ మేనేజర్ మా తోట ఎఫ్ పి ఓ- రవీంద్రనాథ్ బట్లు, మన్యం సహజ సీఈఓ శంకర్రావు, కోఆర్డినేటర్ సందీప్ కుమార్, జీవ కోఆర్డినేటర్ కృష్ణ, డెవల ప్మెంట్ అసోసియేట్ మనీషా, లావణ్య ఆర్ట్స్ సిబ్బంది గ్రామ స్తులు పాల్గొని విదేశీ ప్రతినిధు లకు ఆహ్వానం పలికారు.

అయ్యప్ప స్వాములు సహస్ర దీపారాధన

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం డొంకపుట్టుగ గ్రామంలో గురుస్వామి డిల్లీశ్వరరావు గురు స్వామి పర్యవేక్షణలో అయ్యప్ప స్వాములు సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా డొంకపుట్టుగ రామాలయం ఆలయ ప్రాంగణంలో గురుస్వామి డిల్లీశ్వరరావు స్వామి, పాండవ రామారావు స్వామి లతోపాటు అయ్యప్ప స్వాములు సహస్ర దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో దీక్షపూనిన 21 మంది అయ్యప్ప స్వాములతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం: ఏఎంసీ

విశాలాంధ్ర-మెలియాపుట్టి: ప్రతి మారుమూల గ్రామాలలో సైతం గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కరించబడుతుందని పాతపట్నం ఏఎంసీ అధ్యక్ష ప్రతినిధి బైరిసింగి దినకర్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా కానిస్టెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ టీం వారు ఆయా గ్రామాల్లో సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను గుర్తించిన సమస్యలను పరిష్కరించే క్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండలంలో గల కెరసింగి, గూడ తదితర గ్రామాలను బుధ వారం సందర్శించి గిరిజనులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నేతృత్వంలో మండలంలో ప్రతి మారు మూల పల్లెల్లో సైతం గుర్తించిన సమస్యలను పరిష్కరించే దశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. రహదారి సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలని, పెన్షన్స్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇల్లు మంజూరుతో పాటు ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు పంట నష్టం తదితర వాటిని పరిశీలన చేసి మాకు పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్శనలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన్రావు, మండల పార్టీ అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎంపీటీసీ ప్రతినిధి, డాక్టర్ పైడిరాజు, తెలుగు యువత అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, సీవిఏపీ టీం సభ్యురాలు ఎస్.భారతి ఉన్నారు.

విశాలాంధ్ర
పేజీ 2
శ్రీకాకుళం
గురువారం 06 , నవంబర్ 2025

ఘనంగా విశ్వశాంతి గీతా యజ్ఞం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం దూగానపుట్టుగ గ్రామంలో గీతా మందిరంలో పండితులు లోకనాథ్ పాణిగ్రహి ఆధ్వర్యంలో విశ్వశాంతి గీతా మహా యజ్ఞం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజ్ఞయాగాదులు చేయడం వలన సకాలంలో వర్షాలు కురిచి పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి యువకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని యజ్ఞాన్ని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అధికారుల పర్యవేక్షణ లోపం.. రోడ్లు నిరుపయోగం..

.సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత కరువు

విశాలాంధ్ర-మందస: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం లక్షల రూపాయలు నిధులు ఖర్చుపెట్టి నిర్మిస్తున్న రోడ్లు నాణ్యత లోపం వల్ల అధిక శాతం రోడ్లు రాళ్లు తేలిపోయి రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడు తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లు పనులు జరిగి ఆరు నెలలు కాకుండానే కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లలో అధిక శాతం ప్రజలు నడవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్ల మీద ప్రజలు నడిచి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మించిన సిమెంట్ రోడ్లకు ఇరువైపులా బర్మలు వేయకుండా వదిలేసారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మందసా మండలంలో మందసతో పాటు పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణాలు గత ఆరు నెలలుగా జరిగాయి. పల్లె పండుగ కార్యక్రమంలో జరిగిన సిమెంట్ రోడ్లు పనులకు ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జరిగిన పనులతో పాటు గ్రామ పంచాయతీల నిధులతో కూడా రోడ్లు పనులు జరిగాయి. గత నెల ఆఖరి వరకు ఈ పనులు జరిగాయి. జరిగిన ఈ పనులు పై సరైన పర్యవేక్షణ లేకపోవడం గుత్తేదారులకు సరైన సూచనలు ఇవ్వకపోవడంతో సంబంధిత ఇంజనీరింగ్ శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయలు ప్రజాధనంతో జరిగిన పనులు పట్ల వృధా అయినట్టు ప్రజలు అంటున్నారు ప్రభుత్వ లక్ష్యం జరిగిన పనులు తీరు కు నీరుగారిపోయినట్టుగాకనిపిస్తుందని ప్రజలుఅంటున్నారు.గుత్తేదారులతో ఇంజనీరింగ్ ఉద్యోగులు మిలాకత్ కావడం వల్ల ఈ కొత్త రోడ్లకు ఈ దుస్థితి నెలకొందని అంటున్నారు. అధిక మొత్తం పర్సంటేజ్ లకు కక్కుర్తి పడి రోడ్లు నిర్మాణాలు దారుణంగా తయారయ్యే విధంగా నిర్మించేశారు. ఇంతటి ఘోరమైన పరిస్థితి మునుపెన్నడు ఈ మండలంలో జరగలేదు. అనేక చోట్ల రోడ్ల మీద రోడ్లు నిర్మించారని ప్రజలంటున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్లు పనులకు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది ఉపాధి హామీ పథకం కింద జరిగిన ఈ రోడ్ల పనులకు కూడా అనేక పంచాయతీల్లో గ్రామ పంచాయతీల నిధులు కూడా మళ్లించినట్టు ప్రజలు అంటున్నారు. అనేక చోట్ల ఈ నిధులు అధిక మొత్తంలో కేటాయించి స్వాహా జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని రోడ్లు నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు అక్రమాలపై దర్యాప్తు జరపాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకొండ పాత రెవిన్యూ డివిజన్ ను జిల్లా చేయండి

లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలి
కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు జిల్లా సాధన సమితి విజ్ఞప్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ ను జిల్లాగా చేయాలని, అలా కుదరని ఎడల పాలకొండ ను శ్రీకాకుళం జిల్లాలో కలపాలని పాలకొండ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ని పాలకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవితో కలిసి శ్రీకాకుళం రూరల్ కల్లేపల్లి గ్రామంలో విజ్ఞాపన పత్రం బుధవారం అందించారు. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ ను జిల్లా చేయాలి లేదా శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరుతూ జరుగుతున్న ఉద్యమం గురించి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి నట్లు సాధన సమితి నాయకులు తెలిపారు. జిల్లాల పునర్విభజన జరిగిన నష్టాన్ని పోర్చడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని, మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్తానని సందర్భంగా నేను ఈ అంశాన్ని లేవనెత్తానని హామీ ఇచ్చారు. మంత్రి ని కలిసిన వారిలో సాధన సమితి గౌరవ అధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు,అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు,సాధన సమితి నాయకులు సబ్బ నానాజీ, తుమ్ముగుంట శంకర్రావు,రుంకు రామకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వల్లూరు సత్య నారాయణ,తెలుగుదేశం పార్టీ పట్టణ మాజీ గుమ్మడి సింహాద్రి, బిజెపి నాయకులు పవన్ సాయి, పైల అక్కల నాయుడు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు వెన్నపు వెంకట రమణ, దుంపల రమేష్ బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దుప్పాడ గణేష్, శాసపు సర్వారావు, గుమ్మడి గోవింద రావు, గుడివాడ నీటి సంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి ఎంపికైన కాశీబుగ్గ విద్యార్థిని లాల్య

విశాలాంధ్ర-పలాస: నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలలో 8, 9, 10వ తరగతులో చదువుతున్న విద్యార్థులకు మూడు స్థాయిలలో పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీకాంత్ లు తెలిపారు. మొదటి స్థాయి: పాఠశాల పరిధి రెండవ స్థాయి: మండల పరిధి, మూడవ స్థాయి: నియోజకవర్గ పరిధిలో ఈ నెల 1న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. మూడు మండలాల నుండి వచ్చిన 9 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు మరియు క్విజ్ పోటీలు నిర్వహించి వాటిలో మొదటి ముగ్గురికి విజేతలుగా నిర్ణయించారు. వారిని మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు

విజేతలు: వివిధ పోటీలలో మొదటి స్థానంను కాశిబుగ్గ హైస్కూల్ లో పదో తరగతి చదువుతున్న ఆర్ సి హెచ్ లాల్య, రెండో స్థానం ను టి. నవ్య శ్రీ, మూడో స్థానంను గరుడ భద్ర హైస్కూల్ కు చెందిన టి. హనీ లు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుఎస్.మురళి జె. ఎల్ డైట్వమరవెల్లి,సిహెచ్ .కృష్ణారావు ప్రధానోపాధ్యాయులు హరిదాసుపురం,బి. ప్రసాద రావు జెఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పలాస,ఎస్.మాధవరావు, బ్రాహ్మణతర్ల హైస్కూల్బి. సతీష్, ప్రభుత్వ పాఠశాల పలాస, వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ ఏ రవి బాబు, మూడు మండలాల మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. కాగా లాల్య ప్రముఖ వైద్యురాలు మేఘన కుమార్తె.

జనసేన నాయకులని కలిసిన కొత్తూరు వైసీపీ నేతలు

– ఆత్మీయ కలయిక... జనసేన వైపు చూపు?

విశాలాంధ్ర - కొత్తూరు:జనసేన పార్టీ కీ చెందిన సూడా చైర్మన్, కోరికాన రవి కుమార్, ఆ పార్టీ పాత పట్నం నాయకురాలు కోరికాన భవాని లను కొత్తూరు మండలానికి చెందిన వైసీపీ ముఖ్య నాయుకులు ఓ ఇద్దరు, ముగ్గురు, కూటమి పార్టీ లోని కొద్ది మంది నాయుకులు రెండు రోజుల క్రితం ఆత్మీయ కలయిక పేరు తో శ్రీకాకుళం సుడా లొ కలిశారు వారితో జనసేన జిల్లా బాద్యులు పిసిని చంద్రమోహన్, సుడా చైర్మన్ రవికుమార్,, ఆ పార్టీ పాత పట్నం నాయుకురాలు భవాని లు తో కొత్తూరు నేతలు ఫోటోలు దిగారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పాత పట్నం నియోజకవర్గం లొ తమ పార్టీ పటిష్టానికి జనసేన నాయుకులు సుడా చైర్మన్ రవికుమార్, ఇక్కడ నుండే రానున్న 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉండాలన్న సంకల్పం తో రాజకీయం గా కోరికాన భవాని లు ముందు కు సాగుతున్న విషయం కాస్త పాత పట్నం రాజకీయా లు తో పరిచయం ఉన్న వారికీ తెలిసేందే. అందులో భాగం గానే ఈ ఆత్మీయ కలయికలు అని చెప్పొచ్చు

జోగి రమేష్ అరెస్టు కక్ష సాధింపే

ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: వైకాపా ముఖ్య నాయకులు, మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ ముమ్మాటికీ కక్ష సాధింపేనని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపాను రాజకీయంగా ఎదుర్కొలేక కూటమి ప్రభుత్వం ఇలా పిరికిపంద చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో పాలన గాడితప్పిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకుందని, నకిలి మద్యం వ్యవహారంలో టీడీపీ పరువు బజారున పడిందని దీనిని కప్పిపుచ్చేందుకే రమేష్ అరెస్టు చేసి ప్రజల దృష్టిని అటు మళ్లించారని ఆరోపించారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

– బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల మాజీ అధ్యక్షులు మెట్ట తిరుమల రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ప్రవాసి యోజన కార్యక్రమానికి ప్రవాసి యోజన మండల ఇన్చార్జ్ గా భారతీయ జనతా యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులందరూ కలిసి అంకితభావంతో కృషి చేయాలని ప్రవాసి యోజన ఇన్చార్జ్ మరియు బిజెపి యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి అన్నారు. ఈ మండలంలో ఉండే ప్రతి నాయకుడు బూత్ స్థాయిలో పార్టీ ఎదుగుదలకు కోసం కలిసి పనిచేసి, అందరిని కలుపుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండల కమిటీలు బూతు కమిటీలు శక్తి కేంద్ర ప్రముఖుల కమిటీల పై పార్టీ నాయకులతో చర్చించి రాబోవు స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దివాకర్ మెట్ట మన్మధరావు దుంప ఉమామహేశ్వరరావు లక్ష్మణరావు గోవిందరావు, మాధవరావు, నరసింహ అప్పుడు, లక్ష్మణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి దేవాలయంలో శిఖర ధాన్య ప్రతిష్ఠ

విశాలాంధ్ర -సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయం లో శిఖర ధాన్య ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సూర్యమారుతిసేవాసంఘం ఆధ్వర్యంలో దాతలు సహకారం తో నిర్మాణం జరుగుతున్న ఈ ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా వేద పండితులు శిఖర ధాన్య ప్రతిష్ఠ కార్యక్రమంఅత్యంత వైభవంగానిర్వహించారు . ఈ కార్యక్రమం లో ఆలయ కమిటి పెద్దలు,గ్రామపెద్దలు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.అయితే సుమారు రూ. 60లక్షలు నిర్మాణ వ్యయం తోప్రారంభించిన ఈ ఆలయానికి భక్తులు, దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందించిసహకరించారని ప్రతీ ఒక్కరికీ ఆలయ కమిటిసభ్యులుధన్యవాదాలు తెలిపారు.ఇంకా చాలా భక్తులు సహృదయం తో ఈ ఆలయం నిర్మాణం లో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పలాస సీఐ ఎం తిరుపతిరావు

విశాలాంధ్ర-మందస: విద్యార్థులు క్రమశిక్షణగా మెలగాలని పలాస సీఐ ఎం తిరుపతిరావు అన్నారు. బుధవారం మండలం కుంటికోట నారాయణ పాఠశాలలో నిర్వహించిన సంకల్పం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న నేరాలు, విద్యార్థుల్లో చట్ట పరిజ్ఞానం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం గురించి ఆయన వివరణాత్మకంగా వివరించారు. యువత సమాజ మార్పుకై ప్రధాన శక్తి అని, విద్యార్థులు క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతంగా ఎదగాలని సూచించారు. నేరాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటన, మాదక ద్రవ్యాల వలన కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మందస ఎస్. ఐ కె.కృష్ణ ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబుగాం గ్రామంలో పోలీసుల పల్లె నిద్ర

విశాలాంధ్ర-మందస: మండలం అంబుగాం గ్రామంలో మందస పోలీసులు మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో కాశీబుగ్గ రూరల్ సిఐ ఎం తిరుపతిరావు,మందస ఎస్ఐ కె కృష్ణ ప్రసాద్ లు మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో శాంతిభద్రతలు పరిరక్షణకు, గ్రామస్తుల లో భద్రతాభావం పెంచేందుకు పోలీస్ శాఖ పల్లెనిద్ర కార్యక్రమం చేపడుతుందన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ శాఖకు సంప్రదించాలన్నారు. అత్యవసరమైతే 112 కు డయల్ చేయాలన్నారు. పలు చట్టాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలకు ఆవేశాలకు లోను కాకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు.అనంతరం సైబర్ క్రైమ్, ఉమెన్ సేఫ్టీ తదితర అంశాలపై అవగాహన ఏర్పరిచారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై టి వెంకటేష్, పోలీస్ శాఖ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో బోల్తాపడ్డ బొలెరో పికప్ వ్యాన్

తప్పిన ప్రాణాపాయం, నలుగురికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర-మందస:మందస మండలం మహదేవపురం సమీపాన ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో పికప్ ఫ్యాన్ ప్రమాదవశాత్తు గెడ్డలో బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో నలుగురు స్వల్ప గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం హంసరాలి పంచాయతీ మందూరు గ్రామానికి చెందిన సుమారు 25 మంది భక్తులు బొలెరో పికప్ వ్యాన్ లో మందస, పిడి మందస, మహదేవపురం,దేవుపురం, పొత్తంగి గ్రామాలలో గల పలు దేవాలయ దర్శనానికి బయలుదేరారు. మహదేవపురం ఆలయం దర్శించుకుని దేవుపురం మీదగా వెళ్తున్న సమయంలో మలుపు వద్ద గెడ్డలో ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో బడియా బయా, మార్కండే గౌడ,ధతియా గౌడ, రాజాన ప్రహ్లాద అనే నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. సమాచారం తెలుసుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.మందస తహశీల్దార్ మిస్కా శ్రీకాంత్ రెవెన్యూ సిబ్బందితో సహా సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మందస పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు.

నారా భువనేశ్వరి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: లండన్లో నిర్వహించిన గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఎండీ నారా భువనేశ్వరి గారు అందుకున్న ప్రతిష్టాత్మక అవార్డులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ, సామాజిక సాధికారత రంగాల్లో విశిష్టమైన సేవలకు గుర్తింపుగా లభించిన "డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ - 2025 అలాగే హెరిటేజ్ ఫుడ్స్ కార్పొరేట్ గవర్నెన్స్లో నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలకు అందించిన "గోల్డెన్ పీకాక్ అవార్డు" భువనేశ్వరి గారి నిబద్ధత, విలువలు, పారదర్శకతకు ప్రతీకలని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా జరుగుతున్న విద్య, ఆరోగ్యం, సేవా కార్యక్రమాలు వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని, ఆ సేవా లక్ష్యంలో భువనేశ్వరి పాత్ర అశేషమని మంత్రి పేర్కొన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ను నాణ్యత, విశ్వసనీయత కలిగిన సంస్థగా తీర్చిదిద్దడంలో ఆమె చూపిన నాయకత్వం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. ఈ అవార్డులు నారా భువనేశ్వరి కృషికి వచ్చిన ప్రపంచస్థాయి మన్నన మాత్రమే కాక, మహిళా నాయకత్వానికి స్ఫూర్తిదాయకమైన మైలురాయిగా నిలుస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

పోలాకి విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

విశాలాంధ్ర-పోలాకి: మండలంలో విద్యుత్ వినియోగదారులకు ముఖ్య విజ్ఞప్తి చేస్తూ సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు నిమిత్తము ఈ క్రింది తెలిపిన గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు నిలుపుదలకు వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్కలి డివిజన్ నరసింహ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిన్నింటిపేట 11 కె.వి ఫీడర్ నందు కండక్టర్ మార్చడం పని నిమిత్తం పిన్నింటిపేట, ఆక్వా సర్వీసు రైతులు మరియు పోలాకి 33/11 కె.వి సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో గొల్లలవలస, ఎస్ ఎల్ పురం, కొండలక్కివలస, సుసరాం, తోటాడ స్టోన్ క్రషర్ ఇండస్ట్రీస్, ఆక్వా సర్వీస్ లకు, డోల, గోవిందపురం, ఉర్జం, చెల్లయవలస, గంగివలస, అంబీరుపేట, మెట్టపేట, మోగివిల్లిపేట, రాజారాంపురం, అంపలాం, రేవు అంపలాం, నందిగాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నందున ఆయా గ్రామ ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ నరసింహ కుమార్ కోరారు.

గ్రామ గ్రామాన జీవనోపాధిపై అవగాహన

ఏపిఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర-మందస: ప్రభుత్వఆశయానికి అనుగుణంగా మహిళా సంఘ సభ్యులు అందరి ఆమోదంతో తీసుకున్న రుణాలను, సక్రమంగా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకొని , ప్రతి గ్రామంలో మహిళలు ఎంటర్ప్రెనర్లుగా తయారు కావాలనే ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం కుసుమల మరియు దేవ్ పురం గ్రామ సంఘం మహిళలు సమావేశాలు జరిపించుకొని ప్రస్తుతం ప్రభుత్వము మహిళాభివృద్ధికి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పాత లోన్లు చెల్లించిన వారందరికీ మైక్రో క్రెడిట్ ప్లాన్ ఆధారంగా సి.ఐ.ఎఫ్., ఉన్నతి, శ్రీనిధి, బ్యాంకు ద్వారా కొత్త రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుసుమల అధ్యక్షురాలు ఎస్.పద్మావతి, దేవ్ పురం అధ్యక్షురాలు జి.భారతి, వివో ఏలు జగబంధు,ఆనంద్, పుష్ప, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం

విశాలాంధ్ర-కవిటి: కవిటిలోని కే కొత్తూరు భారతీయ విద్యా కేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో కార్తిక పౌర్ణమి సందర్భంగా విద్యార్థులు దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రతీ విద్యార్థి మూడు ప్రమ్మిదలలో శివలింగం ఆకృతిలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు అనిల్ విద్యార్థులకు కార్తిక మాసం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, డిల్లీరావు, కృష్ణ కుమార్, సుహాసిని, ఝాన్సీ, అంజలి, మాదికమ్మ, సరిత, రాజేశ్వరి, నిర్మల ధర్మారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో మౌలిక సౌకర్యాలు కల్పించే దశగా చర్యలు చేపట్టండి

ఆదివాసి గిరిజన సంఘ కార్యదర్శి అప్పన్న

విశాలాంధ్ర- మెళియాపుట్టి:అరకొరగా ఉన్న వసతి గృహాలలో మౌలిక సౌకర్యాలు కల్పించే దశగా ఆయా అధికారులు చర్యలు చేపట్టాలని, మెళియాపుట్టి మండలం బందపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల పిల్లలతో ఉపాధ్యాయిని కాళ్ళు నొక్కించుకుంటున్న ఘటన పై సమగ్రమైన దర్యాప్తు జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు బందపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి అక్కడ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతునే హాస్టల్లో సరైన మౌలిక సౌకార్యాలు, తగిన సిబ్బంది లేకపోవడం అన్యాయమని, ప్రధానంగా ప్రహరిగోడ ఇంకా నిర్మాణం పెండింగ్ లోనే ఉందని, దోమతెరలు ఇవ్వక పోవడం, పూర్తిస్థాయిలో ఏ.ఎన్.ఎమ్ లేకపోవడం, టీచర్ గా ఉన్న వాళ్ళే వార్డెన్ గా పనిచేయాల్సి వస్తోందని, 3,4,5 తరగతులకు భోదించుటకు ఎస్జీటీ పోస్ట్ ఖాళీగానే ఉన్నాయని, స్కూల్ ఆవరణలో స్తంభాలకు లైట్లు వేయాలని, తదితర సమస్యలపై అధికారులు దృష్టి సారించి శాశ్వత ప్రాతిపదికన వాటి పరిష్కారానికి కృషి చేయాలని అలా కాకుంటే ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ సందర్భనలో ఆయనతోపాటు ఆరిక మన్మధరావు, సవర భాస్కరరావు, బిత్తాడసింగి గవరయ్య జిల్లా కమిటీ సభ్యులున్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : చేసేది పోలీస్ ఉద్యోగం...విధి నిర్వాహణలో మరణాలు, మృతదేహాలు చూడటం విచారణలు చేయడం సహజం...సేవాతత్పరత ఆయన స్వభావం....మరణించిన వారి అంతిమయాత్రలు, అంత్యక్రియలకు తప్పక పాల్గొనే నైజం అం దులోను అనాథ శవాలంటే ముందుగా గుర్తెచ్చేది 'రామ'నామం. గత ఐదేళ్ళుగా స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా విధులు నిర్వర్తిస్తూనే అనాథ శవం కనిపించిందంటే చాటు దానికి దగ్గరుండి సొంత ఖర్చుతో అంత్యక్రియలతో పాటు పలు సందర్భాల్లో దశ దిన కర్మలను కూడా తెలుకల రామారావు నిర్వహించేవారు. దాంతో ఎక్కడ అనాథ శవం కనిపించినా స్థానికులు ముందుగా గుర్తు చేసుకునే పేరు రామారావు. ఇటీవల ఏ.ఎస్.ఐగా పదోన్నతితో కంచిలి స్టేషన్కు అతనికి బదిలీ అయినా ఇచ్చాపురంలో కూడా తన సేవలను కొనసాగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా బుధవారం ఇక్కడకు వచ్చి ఓ అనాధ శవానికి అంత్యక్రియలు జరిపారు. స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద ఓ వృద్దుడు అనారోగ్యంతో బాధపడుతుండగా గమనించిన స్థానికులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సహాయం పొందుతూనే అతను మంగళవారం రాత్రి మరణించాడు. మృతుడు కోటబొమ్మాళి గ్రామానికి చెందిన దబ్బీరు నారాయణ పట్నాయక్ (75)గా పోలీసులు గుర్తించారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నా కనీసం అంత్యక్రియలు కూడా నిర్వహించుకునే స్థోమత లేని విషయాన్ని తెలుసుకున్న ఏ.ఎస్.ఐ రామారావు తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు జరిపించి తన గొప్ప మనసును చాటుకున్నారు. రామారావు సేవలను పలువురు ప్రశంశించారు.

కార్తీక పౌర్ణమి ప్రత్యేక హెూమం

– వంశధార విద్యాసంస్థల్లో ఆధ్యాత్మిక వైభవం

-ప్రజా శ్రేయస్సు కోసం యజ్ఞాగ్ని ఆరాధన

-చింతాడ అనిరుద్రుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కోటబొమ్మాళి వంశధార విద్యా సంస్థల ప్రాంగణంలో గల యజ్ఞశాలలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక వైభవం అలముకుంది. ప్రతి ఆదివారం గాయత్రి హెూమాన్ని ఆనవాయితీగా నిర్వహించే ఆ విద్యాసంస్థల వ్యవస్థాపకులు చింతాడ అనురుద్రుడు, ఈ సారి ప్రత్యేక పూజలు, హెూమాలు ఘనంగా నిర్వహించారు.యజ్ఞాగ్నిలో ఆవిర్భవించిన వేదమంత్రాలు ప్రాంగణమంతా మార్మోగగా, భక్తి భావంతో కళాశాల అధ్యా పకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో అందరికీ అన్న దానం జరిపి, 'అన్నదానం మహాదానం' అనే సూత్రాన్ని ఆచరణలో చూపించారు. ఈ సందర్భంగా చింతాడ అనురుద్రుడు మాట్లాడుతూ "ఈ పూజలు నా యోగక్షేమం కోసం కాదు... మన మండ లంలోని ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం శాంతి, సౌఖ్యాలతో జీవించాలని కోరుకుంటూ గత పది సంవత్సరాలుగా ఈ యజ్ఞాలను నిరంతరంగా నిర్వహిస్తున్నానన్నారు. కళాశాల ప్రాంగణంలోని యజ్ఞ శాలలో ప్రతివారం ఆధ్యాత్మిక దీప్తి ప్రసరించేలా జరుగుతున్న ఈ గాయత్రి హెూమం ఇప్పుడు వంశధార విద్యాసంస్థల గుర్తింపుగా, ప్రజా విశ్వాసానికి ప్రతీకగా మారింది.